## క్లుప్తంగా

### ఎంపీ వైవీతో కైపు భేటీ



ఎంపీ వైవీతో కైపు అశోక్‌రెడ్డి

**తాళ్లూరు:** రాజ్యసభ వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్ సీపీ మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు కైపు అశోక్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పలు అంశాలను వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**దర్శి:** ఆటోనగర్ ప్రాంతంలో 11 కేవీ ఫీడర్ లైన్ పక్కకు మారుస్తున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దర్శి ఆటోనగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ సచ్చన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్ పరిధిలో ఉండే అద్దంకి రోడ్డు, ఆటోనగర్, గంగవరం రోడ్డు, సందువారిపాలెం, చింతలపాలెం ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

### టపాసుల విక్రయానికి అనుమతి తప్పనిసరి

**పుల్లలచెరువు:** దీపావళి పండగను పురస్కరించుకుని గ్రామాల్లో టపాసుల విక్రయానికి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని ఎస్ఐ సంపత్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా దీపావళి మందులు అమ్మరాదని, దీపావళి పండగ సందర్భంగా ముందుగా నిల్వ చేయడం, షాపుల్లోనే ఉంచి అమ్మకాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అనుమతి పొందిన వారు మాత్రమే అమ్మకాలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

### విద్యాభివృద్ధికి కృషి చేయాలి



నియామక పత్రాలు అందుకుంటున్న ఉపాధ్యాయులు

**పెద్దదోర్నాల:** గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ మస్తాన్‌నాయక్ పేర్కొన్నారు. పాఠశాలలో చేరనున్న నూతన ఉపాధ్యాయులకు సోమవారం ఆయన నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగం వృత్తి కాదని, నవ సమాజాన్ని తయారు చేసే బాధ్యతన్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో మొద్దు నాగేశ్వరరావు, మందగిరి వర్ధన్, రామకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

### సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి




రికార్డులు పరిశీలిస్తున్న సీఐ రామారావు

**తాళ్లూరు:** సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని దర్శి సీఐ వై.రామారావు సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. తొలుత రికార్డులు, స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాధితుల పట్ల గౌరవంగా మెలగాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ రామారావు ఆదేశించారు. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు, ఏఎస్ఐ భాస్కర్‌రావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

### బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయునికి సన్మానం



రామాంజనేయులుతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

**దొనకొండ:** మండలంలోని పోలేపల్లి పంచాయతీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఏడేళ్లుగా ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన బద్రి వెంకట రామాంజనేయులును సోమవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాసు మాట్లాడుతూ బద్రి వెంకట రామాంజనేయులుకు గ్రామంలో మంచి పేరు ఉందని, విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల గౌరవంగా ఉండేవారని గుర్తు చేశారు. ఆయన పాఠశాలకు ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీవీ రామాంజనేయులు, పావని, సీఆర్‌పీ దేవమణి, పాఠశాల చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.




వై.పాలెం: ఎమ్మెల్యే తాటిపర్తితో పాటు ర్యాలీలో కదం తొక్కుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



వై.పాలెం: ఎక్సైజ్ సీఐకి అర్జీ అందిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి, మహిళా నేతలు



దర్శిలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

# నకిలీ మద్యంపై ఆగ్రహ జ్వాల

నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్యులు మండిపడ్డారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. అన్ని ఎక్సైజ్ పోలీసుస్టేషన్ల ఎదుట ఆందోళనకు దిగి ఎస్‌హెచ్‌ఓలకు వినతిపత్రాలు అందించారు. అందులో భాగంగా యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఆయా పట్టణాల్లో ర్యాలీ చేపట్టారు. యర్రగొండపాలెంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ర్యాలీ అగ్రభాగాన నిలిచి ప్రభుత్వ చర్యలను ఖండించారు. ఆయన స్వయంగా ర్యాలీలో పాల్గొనడంతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగింది.

- వైఎస్సార్ సీపీ కార్యకర్తల ర్యాలీ
- నినాదాలతో దద్దరిల్లిన వై.పాలెం
- నల్లబ్యాడ్జిలు, టోపీలు ధరించి ర్యాలీకి హాజరైన మహిళలు
- పోలీసులు ఆంక్షలు విధించినా లెక్క చేయని కార్యకర్తలు
- ర్యాలీ అగ్రభాగాన నిలిచిన ఎమ్మెల్యే తాటిపర్తి

**యర్రగొండపాలెం:** నకిలీ మద్యం తయారీని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ఆ పార్టీ కార్యకర్తలు పట్టణంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ క్యాంప్ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల నుంచి సాగిన ర్యాలీ అగ్రభాగాన ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ నిలిచి కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపారు. ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులుకు అర్జీ ఇచ్చేందుకు ఎమ్మెల్యేతో పాటు మరికొంతమందిని మాత్రమే అనుమతిచ్చారు. నిరసన ర్యాలీలో ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, ఆళ్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి, గుమ్మా పద్మజ ఎల్లేష్ యాదవ్, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, వాగ్యా నాయక్, పార్టీ మండల కన్వీనర్లు ఏకుల ముసలారెడ్డి, గంట వెంకట రమణారెడ్డి, దోమకాల వెంకటేశ్వర్లు, ఎస్.పోలిరెడ్డి, పి.కృష్ణారెడ్డి, ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల అరుణ, జిల్లా కార్యదర్శి రమావత్ అరుణాబాయి, పంచాయతీ రాజ్ రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి సుబ్బారెడ్డి, వివిధ విభాగాల రాష్ట్ర, జిల్లా నాయకులు పల్లె సరళ, గార్లపాటి శార, వేముల రమణమ్మ, కె.ఓబులరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, సయ్యద్ జబీవుల్లా, షేక్ మహ్మద్ ఖాశిం, కందూరి కాశీవిశ్వనాథ్, పబ్బిశెట్టి శ్రీనివాసులు, సూరె శ్రీనివాసులు, దోగిపర్తి సంతోష్ కుమార్, గోళ్ల కృష్ణ, సూరె వెంకటస్వామి, యక్కలి భాగ్యారావు, యక్కలి రాంబాబు, జానకి రఘు, లింగంగుంట్ల.రాములు, లాలునాయక్, సన్నెపోగు సుందరరాజు, పి.రాములు నాయక్, కె.సత్యనారాయణ చౌదరి, తమ్మినేని సత్యనారాయణరెడ్డి, ఆవుల కోటిరెడ్డి, ఆవుల రమణారెడ్డి, ఎల్లారెడ్డి శ్రీనివాసరెడ్డి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, ఎస్.ప్రసాద్, బి.బాలచెన్నయ్య పాల్గొన్నారు.

#### మద్యం మాఫియా గుప్పిట్లో ఏపీ

**దర్శి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో అక్రమ మద్యం ఏరులై పారిస్తున్నారని, ఏపీ మద్యం మాఫియా గుప్పిట్లో ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. తొలుత ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలపై ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మేడికొండ జయంతి, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రెడ్డి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డిలు మాట్లాడుతూ గతంలో మాజీ సీఎం ఎన్టీ రామారావు మద్యపాన నిషేధం తీసుకొస్తే ఆయనకు వెన్నుపోటు పొడిచి అధికారం చేజిక్కించుకుని మద్యపాన నిషేధాన్ని ఎత్తేసి మద్యం ఏరులై పారించిన ఘనుడు చంద్రబాబన్నారు. ఇప్పుడు కూటమి నేతలే బార్లు, మద్యం షాపులు చేజిక్కించుకుని గ్రామ గ్రామానా బెల్ట్ షాపులు నిర్వహించి అక్రమ మద్యాన్ని ఏరులై పారించారన్నారు. అక్రమ మద్యం తాగి రాష్ట్రంలో ఐదుగురు మృతి చెందారన్నారు. నకిలీ మద్యం వ్యవహారంలో టీడీపీ నాయకుల హస్తం ఉండటంతో వారిని తప్పించేందుకు చంద్రబాబు నానాతంటాలు పడుతున్నారని ఆరోపించారు. ఈ కేసులో టీడీపీ నాయకులను అరెస్టు చేస్తే గుట్టు బయట పడుతుందని, తన చెప్పు చేతల్లో పని చేసే సిట్‌ను ఏర్పాటు చేసి మద్యం కుంభకోణాన్ని నీరు గార్చాలని చూస్తున్నారని మండిపడ్డారు. తంబళ్లపల్లెలో కుటీర పరిశ్రమలా అక్రమ మద్యం వెలుగు చూసిందని, అంతా టీడీపీ నేతల కనుసన్నల్లోనే జరిగి కోట్లాది రూపాయలు వెనుకేసుకున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో సీబీఐ ఎంక్వయిరీ వేస్తే అసలు నిజాలు బయట పడతాయని, దీంతో చంద్రబాబు, లోకేష్, పవన్‌ల బండారం బయట పడుతుందన్నారు. తాము జైలుకు పోవాల్సి వస్తుందనే సీబీఐ ఎంక్వయిరీ కోరడం లేదన్నారు. నిజంగా తప్పు చేయకుంటే సీబీఐ ఎంక్వయిరీ కోరాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్‌షాపులు వెంటనే తొలగించాలని కోరారు. నకిలీ మద్యం తాగి చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గుడులు, బడులు, పబ్లిక్ ప్లేస్‌ల్లో ఏర్పాటు చేసిన వైన్ షాపులు, బార్ల లైసెన్స్‌లు రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. తాళ్లూరు, ముండ్లమూరు మండలాల పార్టీ అధ్యక్షులు తూము వెంకట సుబ్బారెడ్డి, చింతా శ్రీనివాస రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య, జెడ్పీటీసీలు నుసుం వెంకట నాగిరెడ్డి, తాతపూడి రత్నరాజు, కౌన్సిలర్ తుళ్లూరి బాబూరావు, విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ దుగ్గిరెడ్డి నారాయణ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఇరుగుల శ్రీనివాసరెడ్డి, నాయకులు కోరే సుబ్బారావు, నలదిమ్ము రమణారెడ్డి, మజ్జువలి, అన్నవరపు రవి, మేడగం బాలకృష్ణారెడ్డి, రవీంద్రారెడ్డి, నాగిరెడ్డి, ఏసుదాసు, సన్నీబాబు, సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




వై.పాలెం: ర్యాలీ అగ్రభాగాన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్




దర్శి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ నేతల ఆందోళన



వై.పాలెం: ఎమ్మెల్యే తాటిపర్తిని అడ్డుకుంటున్న పోలీసు అధికారి

# ఏఎంసీలో ఇసుక అక్రమ నిల్వ



పెద్దదోర్నాల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిల్వ ఉంచిన ఇసుక

**యర్రగొండపాలెం:** మండల కేంద్రం పెద్దదోర్నాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచడం విమర్శలకు తావిస్తోంది. కొందరు అక్రమ వ్యాపారులు ఇసుకను మార్కెట్ యార్డులోని భవనం వెనకగా ఎవరికీ కనబడకుండా నిల్వ ఉంచటం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఎటువంటి సామగ్రి అయినా కూడా మార్కెట్ యార్డులో నిల్వ ఉంచకూడదు. అది ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన నిర్మాణ సామగ్రి అయితే ఉన్నతాధికారుల అనుమతితో మాత్రమే నిల్వ ఉంచాలి. మార్కెట్ యార్డులో నిల్వ ఉంచాలంటే ఎన్నో నియమనిబంధనలు పాటించాల్సి ఉంది. మార్కెట్ యార్డు కమిటీ అధికారులకు తెలియకుండా ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచటం పూర్తిస్థాయిలో నిబంధనలు ఉల్లంఘించడమే. ఈ విషయమే ఏఎంసీ సెక్రటరీని వివరణ కోరగా తాను కొత్తగా ఏఎంసీ సెక్రటరీ బాధ్యతలు తీసుకున్నానని, ఇసుకను డంప్ చేసిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్పష్టం చేశారు.

# అటకెక్కిన పాలన



కురిచేడు కెనరా బ్యాంకు ఎదుట ఇలా..

**కురిచేడు:** మండల కేంద్రంలో డ్రైనేజీ సక్రమంగా లేక మురుగు నిల్వలు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొంతకాలంగా స్థానిక కెనరా బ్యాంకు ముందు చిన్నపాటి వర్షానికి వర్షపు నీటితో పాటు డ్రైనేజీలోని నీరు నిల్వ చేరి తటాకలాం మారింది. బ్యాంకుకు వెళ్లే ఖాతాదారులతో పాటు ఆ వీధిలోని ప్రజలు మురుగు నీటి నుంచి రాకపోకల సాగించి అంటురోగాల బారిన పడుతున్నారు. వినుకొండ రోడ్డులోని షిరిడీ సాయి బాబా మందిరం ఎదురుగా శివాలయానికి వెళ్లే దారిలో మురుగు నిల్వలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. చిన్నపాటి వర్షానికి అక్కడ కూడా రోడ్డుపై మురుగు పేరుకుపోతోంది. గొల్లపాలెం రోడ్డు పూర్తిగా గుంతలు పడి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అపరిశుభ్రత పేరుకుపోతున్నా ప్రతి నెలా మూడో శనివారం మాత్రం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర పేరుతో ఫొటోలకు ఫోజులిచ్చేందుకు తప్ప అధికారులు వారి పనితీరులో మార్పు రాలేదని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కార్యాలయాలు వదిలి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి ప్రజల ఆరోగ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### గ్రీవెన్స్‌సెల్‌కు నాలుగు అర్జీలు

**మద్దిపాడు:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఆదిలక్ష్మి తెలిపారు. అర్జీలను వారం రోజుల్లోపు పరిష్కరించడానికి చర్యలు తీసుకోనున్నట్లు ఆమె వెల్లడించారు.

### కూచిపూడి కళలను ప్రోత్సహించాలి

**ఒంగోలు మెట్రో:** కూచిపూడి నాట్యాన్ని నేర్పుతూ చిన్నారులను తీర్చిదిద్దుతున్న నాట్య గురువు కె.లక్ష్మి సేవలు ప్రశంసనీయమని ఒంగోలు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్ర అభినందించారు. ఎల్సీఈఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు చెన్నకేశవస్వామి దేవస్థానంలో విఘ్నేశ్వర కూచిపూడి నాట్యాలయం, ఒంగోలు వారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కూచిపూడి నాట్య సమ్మేళనంలో సురేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా కవి పొన్నూరి వెంకట శ్రీనివాసులు, బీజేఎంపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ సిద్దంబి, ఎల్సీఈఎస్ నేషనల్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు కె.బుచ్చేశ్వరరావు, జిల్లా గ్రంథాలయం ఇన్చార్జ్ డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఎంతోమందిని నాట్య గురువులుగా కూడా తయారు చేయడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం కూచిపూడి నాట్యం ప్రదర్శించిన చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మద్దాలి మాధవరావు, డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ మధుర, డాక్టర్ కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

# పుల్లలచెరువుకు ఉపాధ్యాయుల కొరత




విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

**పుల్లలచెరువు:** మండలానికి నూతన ఉపాధ్యాయులను జిల్లా అధికారులు అరకొరగానే నియమించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు నూతన ఉపాధ్యాయులు రాకపోవడంతో మళ్లీ పాతరోజులు తప్పేలా లేవు. మండలంలోని వివిధ పాఠశాలలకు నూతనంగా 42 మంది ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరినట్లు ఎంఈవో ఇందిర తెలిపారు. మండలంలోని ప్రైమరీ పాఠశాలలకు 12 మంది, ఉన్నత పాఠశాలలకు 30 మంది ఉపాధ్యాయులు వచ్చినట్లు చెప్పారు. మండలంలోని మొత్తం పాఠశాలల్లో 138 మంది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా అధికారులు కేవలం 42 మందిని కేటాయించినట్లు అధికారులు తెలిపారు. చాలా పాఠశాలల్లో ఐదు తరగతులకు ఒక్కరే ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్న సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమిస్తామని మాటలు చెప్పడం తప్ప ఆచరణలో చూపడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

# త్రోబాల్ పోటీలకు చందలూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**దర్శి:** రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు జెడ్పీహెచ్ఎస్ చందలూరు విద్యార్థుల ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా స్థాయి అండర్ 19 త్రోబాల్ బాల బాలికల జట్ల ఎంపిక శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందలూరులో నిర్వహించారు. ఈ పోటీల్లో జెడ్పీహెచ్ఎస్ చందలూరుకు చెందిన 9, 10 వ తరగతికి చెందిన నలుగురు విద్యార్థులు కే విన్నుబాబు, ఎం యశ్వంత్, ఆర్ ప్రేమ్, ఎస్ సతీష్ కుమార్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంధం గురుప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ పీ బాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

### సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించాలి

**సంతనూతలపాడు:** మనువాదులు, మతోన్మాదుల ప్రమాదం నుంచి రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ మండలంలోని బీ మాచవరంలోని అంబేడ్కర్ భవన్లో సోమవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ శూద్ర వర్ణంలో పుట్టిన వారు విద్య, ఉపాధి పరిపాలనలకు దూరంగా ఉండాలని, అంటరానివారుగా, ఊరికి దూరంగా జీవించాలని మనుధర్మశాస్త్రం చెబుతుందన్నారు. ఈ మనుధర్మ భావజాలం, సనాతన సంప్రదాయాలు సమాజాభివృద్ధికి ఆటంకమని, అమానవీయమైన కుల వివక్షతను అవి పెంచిపోషిస్తాయని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 1929లోనే మనుధర్మ శాస్త్రాన్ని నడివీధుల్లో దగ్ధం చేశారని గుర్తు చేశారు. ఆ మనుధర్మ భావజాలం వంట పట్టించుకున్న మతోన్మాదులు నేడు దేశంలో గద్దెనెక్కటం, వారి భావజాలం విస్తృతమవడం విచారకరమన్నారు. దాని ఫలితంగానే సమాజంలో ఇటువంటి పోకడలు విపరీతమవుతున్నాయన్నారు. జస్టిస్ బీఆర్ గవాయి ప్రధాన న్యాయమూర్తి కావడం మనవాదులకు ఏమాత్రం మింగుడు పడని అంశమని అన్నారు. మతోన్మాదుల చర్యలను ప్రజలంతా ముక్తకంఠంతో ప్రతిఘటించాలని, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, నాయకులు అడ్డగబొట్టు నరసయ్య, సుదర్శి నరసింహం, దాసరి సింగారావు, ప్రేమల సింగయ్య, దారా సుబ్బారావు, కోతి అంజయ్య, అన్నవరపు కోటేసు, కే అంకమ్మరావు, పి.వెంగయ్య, ఏ అంజిబాబు, నూతలపాటి శ్రీను, పులగర కోటేసు పాల్గొన్నారు.